క్లుప్తంగా

సొంత గూటికి చేరిన 'ఎడవల్లి'



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్/పాల్వంచ: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఎడవల్లి కృష్ణ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి టికెట్ రాకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మళ్లీ ఇప్పుడు ఎడవల్లి సొంత గూటికి చేరారు. రాయల శాంతయ్య, చావా వీరయ్య చౌదరి, బొమ్మిడి మల్లికార్జున్, పల్లపు వెంకటేశ్వర్లు, సిరంగి శ్రీనివాస్, చింతనాగరాజు, చారి, వెంకి శ్రీను, కత్తెర హనుమంతరావు, శెట్టిపల్లి వెంకట్ తదితరులు ఉన్నారు.

సీతారాం నాయక్‌ను గెలిపించండి

ఇల్లెందు: బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ గెలుపును కాంక్షిస్తూ పట్టణంలోని 8వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీజేపీ ఓబీసీ రాష్ట్ర నాయకులు మావునూరి మాధవ్ ఆధ్వర్యంలో 8వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరారు.

టేకులపల్లి: మహబూబాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్‌ని గెలిపించాలని బీజేపీ అనుబంధ యువమోర్చా మండల ఉపాధ్యక్షుడు బానోతు వినోద్ కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండలం మొక్కంపాడుతండాలో ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. మాట్లాడుతూ.. విద్యావంతుడైన సీతారాం నాయక్‌ని గెలిపించుకోవాల్సిన అవసరం మనపై ఉందన్నారు.

బీరు బాటిళ్లు స్వాధీనం

పాల్వంచరూరల్: పుల్లాయిగూడెంలోని బెల్టు షాపులో రూ.2,275 విలువ గల 14 బీరు బాటిళ్లను శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. నిర్వాహకుడు లెనిన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగావేలం పాటలకు ఎవరు రాకపోవడంతో వచ్చేనెల 8వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ జి.సుదర్శన్ తెలిపారు. శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో దేవస్థానానికి చెందిన పాత వ్యాపార దుకాణాలకు, తలనీలాలు, చీరలు, పూలదండలు అమ్ముకునేందుకు మూడు సంవత్సరాల కాలపరిమితి లీజు లైసెన్స్ హక్కుల కోసం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించగా ఎవరు ముందుకు రాని కారణంగా వేలంపాటను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

రోజువారీ కూలి ఇవ్వండి..



మాట్లాడుతున్న సారంగపాణి

ఇల్లెందురూరల్: మండుతున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ పథకం కూలీలకు కొలతలతో ప్రమేయం లేకుండా రోజువారీ కూలీ రూ.750 చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని పోచారం తండా గ్రామంలోని యదళ్లకుంటలో పనిచేస్తున్న కూలీలతో శుక్రవారం ఇఫ్టూ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. కూలీలకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వమే సమకూర్చాలని, ప్రతీ కూలీకి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకం సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

నిలిచిన జీపీ భవన నిర్మాణాలు

- మంజూరైనవి 19.. స్లాబ్ లెవల్ 17.. నిలిచిపోయినవి రెండు
- ఏడాదిగా అసంపూర్తిగానే పనులు



వివాదాలతో లెంటల్ లెవల్‌లో నిలిచిపోయిన సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం

ఇల్లెందురూరల్: పరిపాలన సౌలభ్యం.. స్థానిక పాలనను ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో నాటి ప్రభుత్వం ఐదున్నరేళ్ల క్రితం ప్రతి మండలంలోనూ చిన్న గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామపంచాయతీలకు కార్యాలయాల ఏర్పాటుకు అనువుగా భవనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీ భవనాలను ఎంపిక చేసి నాడు అట్టహాసంగా ప్రారంభించారు. కానీ ఇరుకు గదులలో కార్యాలయం నిర్వహించుకోవడం అధికారులకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో పక్కా భవనాలు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఏడాది క్రితం మంజూరైనా పనులు నేటికీ పడుతూ లేస్తూ ముందుకు సాగగా.. నేడు నిధులు లేవన్న సాకుతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

19 పంచాయతీలకు నిధులు మంజూరు...

రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఆవిర్భవించిన గ్రామ పంచాయతీలలో మొదటి విడతగా 19 గ్రామపంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఐటీడీఏల ద్వారా నిధులు మంజూరు చేస్తూ 2023 జనవరి 13న అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇల్లెందు మండలంలో బొజ్జాయిగూడెం, బాలాజీనగర్, సీఎస్పీ బస్తీ, ధనియాలపాడు, ఇందిరానగర్, లచ్చగూడెం, మామిడిగుండాల, మిట్టపల్లి, ముత్తారపుకట్ట, పూబెల్లి, రేపల్లెవాడ, సుభాష్‌నగర్, మస్సివాగు గ్రామపంచాయతీలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా, మామిడిగూడెం, విజయలక్ష్మీనగర్, మొండితోగు, పోచారంతండా, బోయితండా, తిలక్‌నగర్ గ్రామపంచాయతీలకు ఐటీడీఏ ద్వారా ఒక్కో గ్రామపంచాయతీకి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తూ గత ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధుల మంజూరుకు ముందే ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆయా గ్రామపంచాయతీలలో భవనాల నిర్మాణం కోసం అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను ఎంపిక చేసి రెవెన్యూ శాఖ ఆమోదంతో మండల స్థాయి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

నిధుల మంజూరు కాలేదన్న సాకుతో..

గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించి ఏడాది పూర్తయినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. మంజూరైన సమయంలో స్థలం అన్వేషణలో కొంతకాలం, శంకుస్థాపన పేరుతో మరికొంతకాలం.. కాంట్రాక్టర్ల ఎంపిక కోసం ఇంకొంతకాలం పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇలా మండల వ్యాప్తంగా మొత్తం 19 గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనుల్లో ఇప్పటి వరకు 17 గ్రామపంచాయతీలలో పనులు పడుతూ లేస్తూ ముందుకు సాగుతున్నాయి. చాలా వరకు స్లాబ్‌లెవల్‌కు చేరుకోగా కొన్ని మాత్రం లెంటల్ లెవల్‌లోనే ఉండిపోయాయి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి నిధుల మంజూరులో జాప్యం జరుగుతోందన్న సాకుతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. నిధులు మంజూరైన తరువాతే పనులు ప్రారంభిస్తామని మౌఖికంగా సమాధానం చెబుతున్నారు.

స్థలం లేక ఒకచోట .. వివాదంతో మరోచోట

గత ప్రభుత్వం పంచాయతీ భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ స్థానికంగా పాలకుల మధ్య పొడచూపిన విభేదాలు పంచాయతీ భవన నిర్మాణాలపై ప్రభావం చూపాయి. సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో నిర్మాణం సాఫీగా సాగుతున్న క్రమంలో నాటి పాలకవర్గంలో పొడచూపిన విభేదాలు గ్రామపంచాయతీ భవన నిర్మాణం ముందుకు సాగకుండా చేసిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ లాయర్ నోటీసును ఎదుర్కోవాల్సి రావడంతో నిర్మాణ పనులు లెంటల్ లెవల్‌లోనే నిలిచిపోయాయి. ఇక బాలాజీనగర్‌లో అధికార, విపక్ష నేతల మధ్య వివాదాల కారణంగా అందుబాటులో స్థలాలు ఉన్నప్పటికీ కేటాయించడంలో అధికారుల వైఫల్యం కారణంగా గ్రామపంచాయతీ భవనం శంకుస్థాపనకు కూడా నోచుకోవడం లేదు.



స్లాబ్ లెవల్‌లో తిలక్‌నగర్ గ్రామపంచాయతీ భవన నిర్మాణం

నిర్మాణ పనులు వేగవంతం చేస్తాం..



మండలంలో 13 గ్రామపంచాయతీల నిర్మాణ పనులను పంచాయతీరాజ్‌శాఖకు, ఆరింటిని ఐటీడీఏకు అప్పగించారు. ప్రస్తుతం పనులన్నీ స్లాబ్‌లెవల్‌కు చేరుకున్నాయి. బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. త్వరలోనే బిల్లులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఆ వెంటనే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణ, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, ఇల్లెందు మండలం

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



బేతంపూడిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, నాయకులు

టేకులపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో, దేశంలో అన్ని రంగాల అభివృద్ధి, ప్రజాసంక్షేమం లభిస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ని గెలిపించాలని కోరుతూ టేకులపల్లి మండలం బేతంపూడి, నర్సాయిగూడెం, మంగలితండా గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పని ప్రదేశాల్లో కూలీలతో మాట్లాడారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశంలో అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తారని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలను మతం పేరుతో రెచ్చగొట్టి రాజకీయ లబ్ధిని పొందుతుందని తెలిపారు. రాబోయే పార్లమెంట్ పోలింగ్‌లో హస్తం గుర్తుపై ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్యా దేవా నాయక్, కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యానాయక్, మూడు సంజయ్, బానోతు భద్రు, గణేష్, బాబు, గడ్డం మధురెడ్డి, కోరం ఉమ, బోడ సరిత, బండ్ల రజిని, భూక్యా రవీందర్‌సింగ్, చంద్రకళ, రాసమల్ల నర్సయ్య, శంకర్, సర్దార్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును మూసేయడం గర్హనీయం



కమిషనర్ స్వామికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పాల్వంచ: పట్టణంలోని అటవీ శాఖ రేంజ్ కార్యాలయాల వద్ద ప్రజలు నిత్యం తిరిగే రోడ్డును మూసేయడం అటవీ శాఖాధికారులకు తగదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఎ.స్వామికి వినతిపత్రం సమర్పించారు. మాట్లాడుతూ... పాల్వంచ పంచాయతీ కాలం నుంచి ప్రజలు నిత్యం ఆ రోడ్డును ఉపయోగించుకుంటున్నారని అటవీ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి, తమ పరిధి దాటి వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా మున్సిపల్ అధికారులు జోక్యం చేసుకుని ట్రాఫిక్ సమస్యలు, ప్రజా ఇబ్బందులను తొలగించాలని కోరారు.

కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమిల్లి సాయిబాబు, బండి నాగేశ్వరరావు, రాహుల్, దుగ్గిరాల సుధాకర్, పద్మజ, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, గాలి వెంకటేశ్వర్లు, గిరి, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

ఇల్లెందురూరల్: మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజలు పీహెచ్‌సీలను ఆదరించేలా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ శిరీష అన్నారు. మండలంలోని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా కృషి చేయాలన్నారు. గర్భిణులు ఎవరూ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. టీబీ అనుమానితులకు పరీక్షలు నిర్వహించి నివారణకు అవసరమైన మందులను క్రమం తప్పకుండా ఇవ్వాలని ఆదేశించారు. వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బకు గురైన వారికి అందించాల్సిన ఫ్లూయిడ్స్, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, కొమరారం, రొంపేడు వైద్యాధికారులు డాక్టర్ లోహిత, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

ఇక్కడ కూడా కుటుంబపాలన



బజ్జీలు వేస్తున్న తాండ్ర వినోద్‌రావు

చుంచుపల్లి: ఢిల్లీలో మాదిరిగానే ఖమ్మం కాంగ్రెస్‌లోనూ కుటుంబ పాలన నడుస్తోందని పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఢిల్లీలో మాదిరిగానే ఇక్కడ కూడా ఉప ముఖ్యమంత్రి తన భార్య కోసం, ఒక మంత్రి తన తమ్ముడి కోసం, మరో మంత్రి తన కొడుకు టికెట్ కోసం పోరాడారని, చివరకు అది ఒక మంత్రి వియ్యంకుడి దగ్గర ఆగిందని తెలిపారు. నరేంద్రమోదీ గ్యారెంటీలు అసలైన బంగారం లాంటివని, కాంగ్రెస్ గ్యారెంటీలు రోల్డ్‌గోల్డ్ వంటివని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రంగాకిరణ్, చింతలచెరువు శ్రీనివాస్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, సంబూరు రామలింగేశ్వరరావు, జీవీకే మనోహర్‌రావు, రాయుడు నాగేశ్వరరావు, ఆకుల నాగేశ్వరరావు, పైడిపల్లి రవీందర్, గౌస్‌పాషా, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

బజ్జీలు వేయడం వచ్చు..

ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి ప్రధాన సెంటర్‌లోని ఓ బజ్జీల బండి వద్ద స్వయంగా బజ్జీలు వేశారు. ఖమ్మం ఎంపీగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నీటి సమస్యకు చెక్



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

కొత్తగూడెంఅర్బన్: వేసవిలో నీటి సమస్య రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 8, 10, 11, 12 వార్డుల్లో కమిషన్, సిబ్బంది పర్యటించి నీటి సరఫరాలో సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

వాహనాల తనిఖీ

జూలూరుపాడు: మండల కేంద్రంలోని ఒంటిగుడిసె క్రాస్ రోడ్ వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. శుక్రవారం పోలీస్ చెక్ పోస్ట్ వద్ద జూలూరుపాడు ఎస్‌ఐ జీవన్ రాజు పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ... ఎన్నికల దృష్ట్యా డబ్బు, మద్యం రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్స్ సూర్యం, వెంకట్, రామకృష్ణ, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణను వినియోగించుకోండి..



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): వేసవిసెలవుల్లో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి కార్పొరేట్ ఏరియా జీఎం (పర్సనల్) కట్టా బసవయ్య సూచించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో కార్పొరేట్ ఏరియా వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, ఫుట్ బాల్, వాలీబాల్, ఉషూ, కరాటే, డ్రాయింగ్ శిక్షణ శిబిరాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వచ్చేనెల 20వ తేదీ వరకు బాలబాలికలకు కోచ్‌ల ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(పర్సనల్) కోడూరు శ్రీనివాసరావు, అధికారులు ఎం.విజయ్‌భాస్కర్‌రెడ్డి, జీకే.కిరణ్‌కుమార్, టి.శ్రీనివాస్, పాసినెట్, ఏవీ.రమేష్ నాయకులు రమణమూర్తి, పీతాంబరం తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి




అవగాహన కల్పిస్తున్న విజయభాస్కరరెడ్డి

పాల్వంచరూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా కీలకమైందని ఎటువంటి ప్రలోభాలాకు గురికాకుండా మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి కోరారు. మండల పరిధిలోని నాగారం కాలనీ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఓటుహక్కుపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో బాత్‌రూమ్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉపాధి కూలీలందరూ ఉదయం 6 గంటలకే పనులకు హాజరు కావాలన్నారు. కొలతల ప్రకారం రూ.300 వచ్చే విధంగా పనులు చేసుకుని ఉపాధి హామీ ద్వారా ప్రతీ కుటుంబానికి వంద రోజులు పనిచేసి ఈ సంవత్సరం రూ.30వేల ఆదాయాన్ని పొందాలని సూచించారు.

సీతారామపురం గ్రామంపై శీతకన్ను

- రహదారి, విద్యుత్ సౌకర్యం లేక గిరిపుత్రుల అవస్థలు
- ఆపద వచ్చినప్పుడు ప్రాణాలు గాలిలో దీపమే
- పాలకులు మారుతున్నా.. మారని బతుకులు
- పట్టించుకోని ఐటీడీఏ



గర్భిణీని ప్రసవం కోసం డోలిలో తీసుకెళ్తున్న గిరిజనులు (ఫైల్)

పాల్వంచరూరల్: అడవితల్లి ఒడిలో ఒదిగినట్టుండే సీతారాంపురం గ్రామంలోని గిరిపుత్రులు అకస్మాత్తుగా అనారోగ్యం పాలైతే పులినోట్లో చిక్కిన జింకలా విలవిలాడాల్సిందే. ఈ క్రమంలోనే కొందరు ప్రాణాలను కోల్పోతుండగా, మరికొందరు చావు అంచుల వరకూ వెళ్లి అదృష్టశాత్తు బతికి బట్టకడుతున్నారు.

ఇందుకు కారణం వైద్యసదుపాయం కోసం మండల కేంద్రానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడమే. మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో దంతలబోరు గ్రామ పంచాయతీ సీతారంపురం గ్రామం ఉంది. ఈ గ్రామానికి రహదారి లేదు. విద్యుత్ సౌకర్యం లేదు. ఎన్ని ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు మారినా మా బతుకులు మారడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 40 కుటుంబాలు, సుమారు 250 మంది నివాసం ఉంటున్నారు.

ఆపద వస్తే అంతే సంగతులు..

గ్రామంలోని గిరిజన ప్రజలకు అనారోగ్యం పాలైనా, ప్రమాదాలు జరిగినా, పురిటినొప్పులు వచ్చినా ఆస్పత్రికి సకాలంలో తీసుకెళ్లలేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ ఈనెల 2న గ్రామానికి చెందిన నిండు గర్భిణీ అయిన మడకం హూరే అనే మహిళకు పురిటినొప్పులు రాగా 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వాహనాన్ని గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆమెను డోలితో తీసుకెళ్లి వాహనంలోకి ఎక్కించి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో డెలివరీ అయింది. ఇది జరిగిన మూడు రోజులకే మరో గర్భిణీ మడకం ఇడుమమ్మదీ అదే పరిస్థితి. 108 సిబ్బందికి తెల్లవారుజామున 3గంటలకు వచ్చి వాహనాన్ని గ్రామానికి మూడు కిలోమీటర్లు దూరంలో నిలిపివేసి కాలినడక గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే పురుటినొప్పులు ఎక్కువ కావడంతో విద్యుత్ సౌకర్యం లేక సెల్‌ఫోన్ లైట్లతో డెలివరీ చేశారు. తల్లీబిడ్డలను డోలీ కట్టి 108 వాహనం దగ్గరకు తీసుకెళ్లి అక్కడి నుంచి పాల్వంచలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. 108 సిబ్బంది ఆ రాత్రి, తెల్లవారుజామున సకాలంలో గ్రామానికి చేరుకోకపోతే రెండు ప్రాణాలూ గాలిలో కలిసిపోయేవని గ్రామస్తులు వాపోతున్నారు.

పట్టించుకోని ఐటీడీఏ...

మండలంలో అనేక సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వలసలు వచ్చి అటవీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజన గ్రామం సీతారంపురానికి రహదారి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని గిరిజనులు పాలకులకు, ఐటీడీఏ పీఓకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణం చేయండి..



గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసరం వచ్చినప్పుడు గిరిజనులను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లలేక ప్రాణాలు కోల్పోతున్నారు. పలుమార్లు అధికారులకు, నాయకులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నాయకులు, ఐటీడీఏ పీఓ స్పందించి గ్రామానికి మూడు కిలోమీటర్ల రహదారి సౌకర్యం కల్పించాలి.

– మడివి దేవ, సీతారాంపురం

విద్యుత్ సౌకర్యం కల్పించాలి..



గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో, వేసవిలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో జీవనం సాగిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం సోలార్ విద్యుత్ సౌకర్యంతోపాటు రహదారి సౌకర్యం కల్పించి గిరిజనులను ఆదుకోవాలి.

– రవ్వ చుక్కమ్మ, సీతారాంపురం

అటవీశాఖ అభ్యంతరాలున్నాయి..



దంతలబోరు గ్రామపంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామానికి రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలంటే అటవీశాఖ అభ్యంతరాల కారణంగా సౌకర్యాలు కల్పించలేకపోతున్నాం. అయినా మరోసారి కలెక్టర్‌కు, ఐటీడీఏ పీఓకు గ్రామంలో రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని ప్రతిపాదనలు పంపిస్తా.

– కె.విజయభాస్కరరెడ్డి, ఎంపీడీఓ

నల్ల చట్టాలకు నిరసనగా మేడే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

ఇల్లెందు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా మే డే నిర్వహించాలని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఇఫ్టూ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇల్లెందు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ ఇఫ్టూ నేతలు జీఎం కార్యాలయం వద్ద, రైస్‌మిల్, హమాలీ అడ్డాల మీద కార్మికులతో మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర నాయకులు యాకుబ్‌షావలీ, పాయం వెంకన్న మాట్లాడుతూ... చాయ్ వాలా దేశానికి ప్రధాని అయితే ఈ దేశం బాగుపడుతుందని అంతా భావించినట్లు చెప్పారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన మోదీ ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు అమలుకు నోచుకోలేదన్నారు. జీరో అకౌంట్లలో రూ.15 లక్షలు జమ చేస్తానని ప్రకటించాడని తెలిపారు. నల్లధనం వెనక్కి తెస్తానని చెప్పి నోట్ల రద్దు చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేశాడని పేర్కొన్నారు. అలాంటి మోదీ పాలనలో సామాన్య పేద మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా ప్రజలతో కార్మికులు కలిసికట్టుగా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రమేష్, రాజేష్, రవీందర్, వెంకన్న, నరేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పోలారంలో...

ఇల్లెందురూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం 138వ మే డేను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార పోస్టర్లను శుక్రవారం మండలంలోని పోలారంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలను తీవ్రతరం చేస్తూ మేడేను జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పందిర్లపల్లి వీరన్న, శ్రీను, శ్రీరాం, యాకస్వామి, మద్దెల రవి, తేలె శ్రీను, ఈసాల రమేష్, పందిర్లపల్లి కోటయ్య, సత్యం, ఈసాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824
లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148
భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476
ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్ దుర్గాంప్రసాద్ -79979 58226
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148